క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్ప గుచ్ఛం, పూలమొక్కను అందించి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

రఘునాథపల్లి/జనగామ రూరల్: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జెక్కిడి శివచరణ్‌ను సోమవారం యూత్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్ర అశోక్ తదితరులు హైదరాబాద్‌లో శివచరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలి



సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: నూతన సంవత్సర వేడుకలు నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 31న రాత్రి బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వేడుకలు నిర్వహించరాదన్నారు. ఆరు బయట మద్యం తాగినా, అల్లర్లకు పాల్పడినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

బచ్చన్నపేట: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఎస్‌కే హమీద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల31వ తేదీ రాత్రి మద్యం సేవించి వాహనాలను నడుపరాదన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు జమాలొద్దీన్, అనిల్, నర్సిరెడ్డి, రాకేష్, దివ్య ఉన్నారు.

మొక్కజొన్న చేను పరిశీలన



చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామంలో సోమవారం మొక్కజొన్న చేనును స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ వసంతసుగుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్న చేనుకు ఇష్టంవచ్చినట్లు క్రిమి సంహారక మందులు వాడొద్దన్నారు. ఏ సమయంలో మందు పిచికారీ చేయాలో రైతులకు వివరించారు. చిల్పూరు ఏవో నజీరుద్దీన్, ఏఈఓ వినయ్‌కుమార్, రైతులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడదాం..

దేవరుప్పుల: నూతన సంవత్సరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులతోపాటు విద్యాభివృద్ధికి పాటుపడదామని ఎంఈఓ జి.కళావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద పీఆర్‌టీయూఎస్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ ప్రతినిధులతో కలిసి ఎంఈఓ ఆవిష్కరించారు. పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబటి అంజయ్య, గోలి తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

‘అమిత్ షాను బర్తరఫ్ చేయాలి’



స్టేషన్‌ఘన్‌పూర్: నిరసన తెలుపుతున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు, అమిత్ షా దిష్టి బొమ్మలను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షాపై కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టకుంటే దేశవ్యాప్త ఉద్యమాలు చెలరేగే అవకాశాలు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలకుర్తి: రాజీవ్ చౌరస్తాలో..

అద్దె భవనాల్లో జీపీలు

- ఇరుకు గదుల్లోనే కొనసాగింపు
- ఇబ్బందుల్లో సిబ్బంది



తీగలతండాలోని పంచాయతీ కార్యాలయం



గార్లగడ్డతండాలో పాఠశాల భవనంలోని చిన్న గదిలో ఉన్న కార్యాలయం

చిల్పూరు: ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. కానీ జీపీలకు సొంత భవనాల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అప్పటి నుంచి కనీస వసతులు లేని అద్దె, పాఠశాల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. పంచాయతీలకు భవనాలు మంజూరు చేయాలని గతంలోనే పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. సరైన సదుపాయాలు లేక ఇరుకు గదుల్లో సిబ్బంది, కార్యాలయాలకు పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కొత్త పంచాయతీలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సౌలభ్యం దృష్ట్యా తండాలను జీపీలుగా గుర్తించారే తప్ప సొంత భవనాల నిర్మాణం చేపట్టలేదు. దీంతో అద్దె గదులు, పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయాలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. చిల్పూరు మండలంలో తీగలతండా, వెంకటేశ్వరపల్లి, గార్లగడ్డతండాలను జీపీలుగా గుర్తించగా నేటికి సొంత భవనాలు లేవు. తీగలతండాలో కార్యదర్శిగా విమల పనిచేస్తున్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నందున కొత్త భవనాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

- తహసీల్దార్ వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నమిలిగొండ గ్రామంలో ఎస్సీ కాలనీలో సోమవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా తహసీల్దార్ హాజరై మాట్లాడారు. రెవెన్యూ, చట్టపరంగా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా, గ్రామంలోని 175 సర్వేనంబర్‌లో పేద దళితులకు ఇళ్ల స్థలాల కోసం అందించిన పట్టాల విషయంలో ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకూ భూమి చూపించడం లేదని కాలనీవాసులు వాపోయారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా తమగోడు పట్టించుకోవాలని, ఇళ్ల స్థలాల పట్టాల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఎస్సై రమేష్, ఆర్‌ఐ సతీష్, పంచాయతీ కార్యదర్శి జేసుమణి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ శ్రీధర్, మల్లయ్య, చందు, రాములు, ఆదామ్, ఉపేంద్ర, పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ప్రతి పౌరుడు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. మండలంలోని కొడవటూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంఆర్‌ఐ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య పాల్గొన్నారు.

మహా అన్నదానం



జనగామ: నెహ్రూ పార్కు వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

జనగామ: అమావాస్య పర్వదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు ఏరియాలో వాసవీ కన్యకాపరమేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పన్నీరు సిద్దయ్య జ్ఞాపకార్థం మనుమలు, మనుమరాళ్ల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. మరో దాత కోకోల మల్లేశం 10 కిలోల పులిహోర అందించారు. ఉప్పుగల్లు రవీందర్, రంజని దంపతులు, శివ కన్యకా పరమేశ్వరి అమావాస్య అన్నదాన కమిటీ సభ్యులు, ఫౌండర్ నర్సింహారావు, నవీన్ కుమార్ గుప్తా, మధు, శివరామకృష్ణ, రామిని శివుడు, అంజయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

కేక్‌లు వద్దు.. అన్నదానం చేయండి

నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో కేక్‌లు, పూల బొకేలు, బాణసంచా కోసం ఖర్చు చేసే ప్రతి ఒక్కరూ రోడ్డు పక్కన జీవించే అభాగ్యులు, అనాథల ఆకలి తీర్చేందుకు ముందుకు రావాలని అమ్మ ఫౌండేషన్ తెలంగాణ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ ఆవరణలో వారు అన్నదానం చేసి మాట్లాడారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

రఘునాథపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని మహాదేవస్వామి ఆలయ చైర్మన్ కూర్వెళ్ల ఉపేందర్ అన్నారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుకిడె బుచ్చి రాములు–శాంతమ్మల జ్ఞాపకార్థం వారి మనుమడు మహేందర్ ఏర్పాటు చేసిన మహాన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి

జఫర్‌గఢ్ : పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ గుంతలోకి దిగబడడంతో ట్రాక్టర్‌పై నుంచి డ్రైవర్ బురద పొలంలో కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని కోనాయిచలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రడపాక భిక్షపతి (35) కర్ర రామచంద్రు పొలం దున్నేందుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. ఈ క్రమంలో బురద పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ గుంతలో దిగబడి భిక్షపతి బురద పొలంలో పడిపోయాడు. స్థానికంగా ఎవరూ లేకపోవడంతో భిక్షపతి ఊపిరాడక మృతి చెందాడు. ట్రాక్టర్ ఓనర్ కాడబోయిన రామచంద్రు నిర్లక్ష్యం వల్లే భిక్షపతి మృతి చెందాడంటూ బాధిత కుటుంబీకులు అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఎస్సై రాంచరణ్ ఘటన స్థలికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె..

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గర్నెపెల్లి అంజయ్య రోజు మాదిరిగా పశువులను మేతకు తోలుకెళ్లగా పక్కనే వేలాడుతున్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు గేదె తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 80 వేల విలువైన గేదె మృతి చెందిందని ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిల్పూరు: నష్కల్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నష్కల్ గ్రామానికి చెందిన యావగోని యాదగిరి–లక్ష్మి దంపతులు పని నిమిత్తం స్టేషన్ ఘన్‌పూర్‌కు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్లి తిరుగు పయనమన్యారు. వారి వెనుకాలే వేగంగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో ఎగిరి కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

తరిగొప్పుల: గుర్తు తెలియని వ్యక్తులు పది జీవాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటను ఆదివారం అర్ధరాత్రి మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నీల కనుకయ్య ఎప్పటిలాగే తన మేకలను పాకలో తోలి సమీపాన ఉన్న సబ్‌స్టేషన్‌లో నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున మేకల పాకలోని మందను పరిశీలించగా అందులో పది మేకలు లేవని గుర్తించాడు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. మేకల పాక వద్ద నాలుగు చక్రాల వాహనానికి సంబంధించిన టైర్ల ముద్రలు ఉండడంతో తన మేకలు అపహరణకు గురైనట్లు గ్రహించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగలు అపహరించిన మేకల విలువ రూ.2 లక్షల ఉంటుందని బాధితుడు నీల కనుకయ్య తెలిపారు. ఎస్సై గుగులోతు శ్రీదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ ఫోన్ల చోరీ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని సంతలో సోమవారం దొంగలు ఆరు సెల్‌ఫోన్లను చోరీ చేశారు. కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయాడానికి వచ్చిన వారి వద్ద నుంచి దొంగలు గంట వ్యవధిలో ఆరు సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డారు. బాధితులు స్థానిక పోలీస్‌సేష్టన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

సాధిక్‌కు ‘ఇంపాక్ట్’ సర్టిఫికెట్



జనగామ: జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ సాధిక్ ‘ఇంపాక్ట్’ సర్టిఫికెట్ అందుకున్నారు. ఏటూరు నాగారం ప్రభుత్వ ఆర్‌ఐటీఐ(డిపార్టుమెంట్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్)లో విధులు నిర్వర్తిస్తున్న సాధిక్.. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో వ్యక్తిత్వ వికాసంపై ఇపాంక్ట్ ఫౌండేషన్ నిర్వహించిన పోటీలో సత్తా చాటుకున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ మినర్వా గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా ‘ఇంపాక్ట్ సర్టిఫైడ్ స్పీకర్’ సర్టిఫికెట్ అందుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లిలో విశ్వకర్మల మహంకాళమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ మల్లవరం దివ్య, జనగామ మున్సిపల్ కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళాన్ని అందించారు. సోమవారం విరాళాన్ని అందించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్ణాల వేణు, మేడోజు బాలచారి, వెంకటాద్రి, చెంద్రమౌళి, రాజమౌళి, రాములు, రాజేందర్, ఈశ్వర్, సిద్దులు, సోములు, బానుప్రసాద్, యాదగిరి పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రజాపాలనకు అద్దం పట్టేలా మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి నేతృత్వంలో మండలానికి మంజూరైన రూ.6 కోట్ల అభివృద్ధి పనులు నిర్దేశిత సమయంలో పూర్తిచేసే ప్రక్రియపై సమీక్ష జరిపారు. ఇంటింటా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సురేష్‌బాబు, ధర్మారెడ్డి, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

టీసీఐవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పరమేశ్వర్



దేవరుప్పుల: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సామల పరమేశ్వర్ సోమవారం హైదరాబాద్‌లో టీసీఐవీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, రాష్ట్ర పద్మశాలి సంఘ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆనంద్ భాస్కర్ చేతుల మీదుగా నియమాకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర వేదికలో చోటు కల్పించిన రాష్ట్ర ప్రతినిధులతోపాటు జిల్లా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవ చేసే గుణం ఉండాలి

జనగామ: మాన జీవితంలో సేవ చేసే గుణం ఉండాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అవసరార్థులను ఆదుకునేందుకు మనసున్న మనషులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వెండి గంగాళం అందజేత

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం అర్చకులు 191 గ్రాముల వెండి గంగాళాన్ని ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యు మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చిట్యాల మండలం మొగిలిదోరి గ్రామానికి చెందిన కంచర్ల పురుషోత్తమ్‌రెడ్డి జ్ఞాపకార్థం భార్య వనజాత, కుమారుడు ప్రవీణ్‌రెడ్డి–సాయిప్రసన్నలు గంగాలాన్ని అందజేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- సీఐ అబ్బయ్య



అవగాహన కల్పిస్తున్న సీఐ అబ్బయ్య

తరిగొప్పుల: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని నర్మెట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య అన్నారు. మండలంలోని మరియాపురంలోని సెయింట్ ఆన్స్ హై స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన సైబర్ నేరాలు, డ్రగ్స్, డయల్ 100 తదితర అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అదేవిధంగా ఫోన్, ఈమెయిల్ ద్వారా వచ్చే వెబ్ సైట్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు సెల్ ఫోన్స్, కంప్యూటర్లు హ్యాక్ చేసి మన వ్యక్తిగత డేటాను తస్కరించి మనల్ని ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గుగులోతు శ్రీదేవి ,ఏఎస్సై రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

- డాక్టర్ రాజమౌళి



నినాదాలు చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని డాక్టర్ రాజమౌళి డిమాండ్ చేశారు. సోమవారం ఉడుగుల సాగర్ అధ్యక్షతన విజయ ఫంక్షన్ హాల్‌లో వర్గీకరణకు మద్దతుగా ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం సరికాదన్నారు. వర్గీకరణను అమలు చేసే దిశగా జనగామ నుంచే ఉద్యమాలను చేపడతామని అన్నారు. డాక్టర్లు సుగుణాకర్ రాజు, కరుణాకర్ రాజు, కృష్ణ, కౌన్సిలర్లు గాదపాక రామచంద్రం, పెద్ద శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్ల నరసింహారావు హైకోర్టు న్యాయవాది సాదిక్ ఆలీ, మేడ శ్రీనివాస్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



గుంతను పూడ్చేస్తున్న యువకుడు

జనగామ: జనగామ–వరంగల్ హైవే యశ్వంతాపూర్ గ్రామ శివారులో ప్రమాదకరంగా మారిన గుంతలతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు వంద మందికి పైగా గాయాల పాలైనా.. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఎక్కువగా ద్విచక్రవాహన చోదకులు పల్టీలు కొడుతుండడంతో చూసి తట్టుకోలేని గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చీటూరు శేషు, సందపెల్లి పవన్ శ్రమదానం చేసేందుకు ముందుకు వచ్చారు. సొంతఖర్చులతో సోమవారం గుంతలో మట్టిపోసి ప్రమాదాలు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. యువకుల స్ఫూర్తిని చూసి అధికారులు మేలుకోవాలని వాహన చోదకులు అంటున్నారు. యువకులు గ్రామస్తులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

దేవరుప్పుల: మండలంలోని గిరిజన ఆవాస ప్రాంతమైన ధర్మాపురం రెవెన్యూ పరిధి లక్ష్మణ్‌తండా గ్రామానికి చెందిన బానోత్ బ్రదర్స్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. లక్ష్మణ్‌తండాకు చెందిన బానోత్ బీకోజీనాయక్ కుమారులు వృత్తిరీత్యా వ్యాయామ ఉపాధ్యాయులుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న మోహన్, సంతోష్‌కుమార్ ఈ నెల 21వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ సాఫ్ట్‌బాల్ పోటీలకు హాజరయ్యారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఈ మండలానికి చెందిన అన్నదమ్ములు ఎంపిక అయ్యారు. జిల్లాలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన ఇద్దరు అన్నదమ్ములు ఈ నెల 28 నుంచి 30 వరకు మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా టీమ్ సీనియర్ జట్టు కెప్టెన్‌గా మోహన్, సంతోష్ కుమార్ రాణించి పూల్ విన్నర్‌గా ప్రతిభ కనబర్చడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని కె.కావ్య రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభను కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీలు , ఉపాధ్యాయులు కావ్యకు అభినందనలు తెలిపారు.

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

రఘునాథపల్లి: తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు శాగ కిరణ్మయి ప్రథమ స్థానంలో, తాడూరి స్వప్న ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం భారత రవీందర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినంధించి డిక్షనరీలను అందజేశారు.

విద్యార్థికి అభినందనలు

బచ్చన్నపేట: మండల స్థాయి సామాజిక శాస్త్ర పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన పడమటికేశ్వాపూర్ సెకండరీ పాఠశాల విద్యార్థి విఘ్నేశ్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా రాణించాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు పోరాడాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: సమ సమాజ స్థాపనకు విద్యార్థులు పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ వద్ద ‘స్వాతంత్రం– ప్రజాస్వామ్యం– సోషలిజం’ అనే నినాదంతో ఉన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బాగుచేయాలని పాలకులను డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ, మండల కార్యదర్శి మావిడల రమేష్, మురళీకృష్ణ, అర్జున్, రాహుల్, అర్మాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశు వైద్యశిబిరం

చిల్పూరు: రాజవరం గ్రామంలో సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ముడికె అనేష్ పశువులకు చికిత్స నిర్వహించి రైతులకు మందులు అందజేశారు.

ప్రతిభ వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు

జఫర్‌గఢ్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం పద్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

కృతజ్ఞతలు

లింగాలఘణపురం: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన తెలంగాణ రజక రిజర్వేషన్ పోరాట సమితి(టీఆర్ఆర్ఎస్) రాష్ట్ర 3వ మహాసభ సక్సెస్ చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని టీఆర్ఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

బచ్చన్నపేట: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో సోషల్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆదిరెడ్డి అకాడమీ చైర్మన్ కల్నల్ నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

ఆర్థికసాయం

లింగాలఘణపురం: నవాబుపేట, మండల కేంద్రంలో సోమవారం మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.20వేల సాయం అందజేశారు.

పచ్చిగడ్డితో భారతదేశ పటం



లింగాలఘణపురం: మండల పరిధి మాణిక్యాపురం పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు శోభారాణి, నరేందర్, రత్నాకర్ ఆధ్వర్యంలో పచ్చిగడ్డితో భారతదేశ పటాన్ని రూపొందించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం యాదయ్య అభినందించారు. ఇలాంటి రూపకల్పనలతో విద్యార్థులకు బోధనపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

క్రీడలతో బహుళ ప్రయోజనాలు

- పాఠశాల కరస్పాండెంట్ పాండుకృష్ణ



క్రీడాకారులను అభినందిస్తున్న పాండుకృష్ణ

దేవరుప్పుల: విద్యతోపాటు క్రీడా,సాంస్కృతిక రంగాలతో విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందుతారని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ స్కూల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ కేటగిరీల చెస్ ఛాంపియన్ షిప్ విద్యార్థులను ఆయన అభినందించారు. క్రీడా రంగాలతో శారీరక, మానసిక ఉల్లాసంతోపాటు నాయకత్వపు లక్షణాలు, పలు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అండర్–7 బాలుర విభాగంలో తృతీయ స్థానంలో 3వ తరగతి విద్యార్థి బి.ఆరుష్నాద్, అండర్–9 బాలికల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానంలో జీ.చిన్మయి, వి.రిషిక, అండర్–11 బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో టి.త్రివేణి, బి.శ్రీజ, అండర్–13 బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో టి. కళ్యాణ్, కె.ఉజ్వల్, తృతీయస్థానం ఎం.సాయి తేజ పొందారు. ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



పెన్షనర్లను సన్మానిస్తున్న అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఘన్‌పూర్ ఏటీఓ శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను సోమవారం డివిజన్‌కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఘన్‌పూర్ శాఖ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా సీఐ జి.వేణు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ రాజేంద్రకుమార్, ఎస్‌బీఐ ఘన్‌పూర్ మేనేజర్ శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం పెన్షనర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రాజయ్య, సంపత్‌కుమార్, కోతి భిక్షపతి, రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, కృష్ణమూర్తి, రావుల ఏడుకొండలు పాల్గొన్నారు.